## క్లుప్తంగా

### వెన్నుపోటు దినం విజయవంతం చేయాలి

**వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు**



**వేమూరు:** కూటమి ప్రభుత్వం తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ అధికార ప్రతినిధి, నియోజక వర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సోమవారం విలేకరులు సమావేశంలో పిలుపు నిచ్చారు. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు మండల కేంద్రంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. నియోజకవర్గం లోని వేమూరు, అమర్తలూరు, చుండూరు, భట్టిప్రోలు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలు అమలు చేయకుండా అన్ని రంగాల ప్రజలకు వెన్నుపోటు పొడవటం జరిగిందన్నారు. వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### జనార్ధన్‌ను పరామర్శించిన కోన



**కర్లపాలెం:** ప్రముఖ ఆక్వా వ్యాపారవేత్త చెన్ను జనార్ధన్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సోమవారం పరామర్శించారు. చెన్ను జనార్ధన్ తండ్రి జయరామయ్య ఇటీవల మృతి చెందటంతో కోన రఘుపతి వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్ధన్‌ను పరామర్శించారు. కోన వెంట వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, మార్కెట్ యార్డ్ కమిటీ మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, పార్టీ నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, చిక్కాల సాగర్ దొంతిబోయిన జయభారత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### సంపూర్ణ ఆరోగ్య సంజీవని యోగా

**ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్రకుమార్**



**రేపల్లె:** సంపూర్ణ ఆరోగ్య సంజీవని యోగా అని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ అన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిత్యం యోగా చేయటంతో ఆరోగ్యం బాగుంటుందని, మానసిక, శారీరక ఉల్లాసం చేకూరుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచవచ్చని అన్నారు. శిక్షణ తరగతులు 21వ తేదీ వరకు కొనసాగుతాయని, సిబ్బంది, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. యోగా ట్రైనర్ వి.పోలయ్య కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ కె.బాలగురవయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.దాసు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

**తెనాలిరూరల్:** ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన కొల్లిపర మండలం బొమ్ము వానిపాలెం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేపల్లె మండలం గుడ్డికాయలంకకు చెందిన పులి జగదీష్ (13), ట్రాక్టర్ డ్రైవర్ మోహన్‌తో కలసి కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం రీచ్‌కు ఇసుక కోసం సోమవారం ట్రాక్టర్‌పై వచ్చారు. ట్రాక్టర్ అదుపు తప్పడంతో డ్రైవరు పక్కన కూర్చున్న జగదీష్ ప్రమాదవశాత్తు కిందపడగా, బాలుడి మీదకు ట్రాక్టర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కొల్లిపర ఎస్ఐ పి. కోటేశ్వరరావు, సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

### మహిళపై రాయితో దాడి

**తెనాలిరూరల్:** ఇంట్లో నిద్రిస్తున్న మహిళపై గుర్తు తెలియని బాలుడు రాయితో దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరు తోటకు చెందిన 42 ఏళ్ల లక్ష్మీ లావణ్య ఇంట్లో నిదిస్తుండగా సోమవారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో అలికిడైంది. లేచి చూడగా ఇంట్లోకి వచ్చిన సుమారు 16 ఏళ్లు ఉన్న గుర్త తెలియని బాలుడు ఆమెపై రాయితో దాడి చేసి గాయపర్చి వెళ్లిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వేతనాలు లేని ఉపాధి

- వేతనాలు లేక అవస్థలు పడుతున్న ఉపాధి కూలీలు
- 10 వారాలుగా ఉపాధి పనులకు డబ్బులు చెల్లించని ప్రభుత్వం
- పనుల కల్పనలోనూ పార్టీ వివక్ష చూపుతున్నారని అంటున్న కూలీలు



వేమూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

**వేమూరు:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఉపాధి కూలీల వేతనాలు గురించి పట్టించుకోవడం లేదు. ఉపాధి పథకం పనులకు గత 10 వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ పరికరాలు వచ్చిన తర్వాత కూలీలకు వ్యవసాయ పనులు సక్రమంగా ఉండడం లేదు. కూలీలందరు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. మార్చి నెల నుంచి ఉపాధి పనులు చేపట్టారు. మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఉపాధి పథకం కూలీలకు వేతనాలు చెల్లించడం లేదని కూలీలు వాపోతున్నారు. కూలీ పనులకు వెళితే గాని కుటుంబ అవసరాలు గడవని కూలీలకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ ఖర్చులకు డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నామని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కూలీలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

**పనుల కల్పనలోనూ వివక్ష**

కూటమి ప్రభుత్వ నాయకులు జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనుల్లో కూడా పార్టీ వివక్ష చూపుతున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి పనుల కేటాయింపులో వైఎస్సార్‌సీపీకి చెందిన సానుభూతిపరులకు పనులు ఇవ్వడం లేదని కూలీలు చెబుతున్నారు. కూటమి పార్టీ చెందిన వ్యక్తులకు, సానుభూతిపరులకు మాత్రమే పనులు కేటాయించడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం పనులు కేటాయింపులోనూ పార్టీ వివక్ష చూపకుండా పనులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

#### 9 వారాల డబ్బులు రావాలి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు 9 వారాలు వెళ్లాను. నాకు 9 వారాల డబ్బులు రావాలి. గత ప్రభుత్వంలో ప్రతి వారం కూలీలకు డబ్బులు చెల్లించడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఉపాధి కూలీల వేతనాలు విడుదలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది.

– అమర్తలూరు వెంకయ్య, వేమూరు

#### వెంటనే చెల్లించాలి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు 8 వారాలు వెళ్లాను. ప్రభుత్వం ఇంత వరకు ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాలు చెల్లించలేదు. దీంతో కుటుంబం అవసరాలకు చాలా ఇబ్బందిగా ఉంది. ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి.

– అమర్తలూరు వెంకయ్య, అమర్తలూరు

#### అవస్థలు పడుతున్నారు



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. కూలీలు డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిధులు విడుదల చేసి కూలీలను ఆదుకోవాలి.

– తోడేటి సురేష్, కొల్లూరు మండలం

## హామీల అమలులో కూటమి ప్రభుత్వం వైఫల్యం

**వైఎస్సార్‌సీపీ నిజాంపట్నం మండల కన్వీనర్ యార్లగడ్డ వెంకట రాంబాబు**

**రేపల్లె:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ నిజాంపట్నం మండల కన్వీనర్ యార్లగడ్డ వెంకట రాంబాబు ఆరోపించారు. నిజాంపట్నం మండలం అడవులదీవిలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అధికారం కోసం ఒకలా, అధికారంలోకి వచ్చిన తరువాత మరోలా వ్యవహరించటం చంద్రబాబుకు అలవాటేనన్నారు. అమలు చేయలేని హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంవత్సరం గడుస్తున్నా ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసగించిందన్నారు. సంవత్సర ప్రభుత్వ పాలనను ప్రశ్నిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రేపల్లె పట్టణంలోని ఇసుకపల్లి సెంటరు నుంచి ఆర్డీవో కార్యలయం వరకు జరిగే నిరసన శాంతి ర్యాలీలో మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ఆత్మరక్షణ విద్యల్లోనూ రాణించాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ**



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

**రేపల్లె:** విద్యార్థులు చదువుతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందించే క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్, కింగ్స్ వే అకాడమీ రేపల్లె ఆధ్వర్యంలో పట్టణ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల విజేతలకు సోమవారం ఆమె బహుమతులు అందజేసి మాట్లాడారు. అత్యవసర సమయాలలో ఆత్మరక్షణ విద్యలు బాలబాలికలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోటీలలో రాణించే వారికి గుర్తింపు లభించటంతో పాటు మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ పోటీలలో జిల్లా నలుమూలల నుంచి 135 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఓవరాల్ చాంపియన్ షిప్‌ను రేపల్లెకు చెందిన కింగ్స్ వే అకాడమీ క్రీడాకారులు ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, గుంటూరు క్రీడాకారులు ద్వితీయ స్థానం, చిలకలూరిపేట క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులు ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వీరి అభ్యున్నతికి కృషి చేసిన కోచ్‌లను అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నయాబ్ రసూల్, వసతి గృహ అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, నెలబాలుడు, ఎం.శ్రీనివాసరావు, యెండూరి రాజేష్, అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ రంగ, జాయింట్ సెక్రటరీ కె.ప్రసాద్‌బాబు, కోచ్‌లు కె.బాబూరావు, రాజేష్‌వర్మ, సాంబశివరావు, రామకృష్ణ, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ రేషన్ విధానాన్ని కొనసాగించాలి

**సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్**



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎండీయూ ఆపరేటర్‌లు

**రేపల్లె:** ఎండీయూ రేషన్ వాహనాలను కొనసాగించి పేదలకు ఇళ్ల వద్దకే రేషన్‌ను అందించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని కొనసాగించి ఎండీయూ వాహనదారులు, అసిస్టెంట్‌లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎండీయూ ఆపరేటర్‌లు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయటం అమానుషమన్నారు. ఇంటింటికీ రేషన్ విధానంతో రేషన్ సరుకులు కార్డుదారుల ఇంటికే చేరుతున్నాయని, లబ్ధిదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ పథకంను రద్దు చేయటంతో కార్డుదారులు రేషన్ షాపుల చుట్టూ తిరుగుతూ గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటాయన్నారు. ఎండీయూ వాహనాలు రద్దు చేయటంతో రాష్ట్ర వ్యాప్తంగా 18,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. 2027 వరకు ఎండీయూ వాహనాలు కొనసాగించాలని గత ప్రభుత్వ అగ్రిమెంట్ ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం 2025 జూన్1వ తేదీతో రద్దు చేయటం బాధాకరమన్నారు. ఇంకా 20 నెలల ఈఎంఐలు ఉండటంతో వాహనదారులకు బ్యాంకుల నుంచి వేధింపులు మొదలయ్యాయన్నారు. రాజకీయ కోణంతో కాకుండా ప్రజలకు ఉపయోగపడే పథకాన్ని కొనసాగించి వాహనదారులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండీయూ వాహనాల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.గోపి, సీఐటీయూ నాయకులు కె.ఆశీర్వాదం, రమేష్, మావో, లెనిన్, అంజన్‌కుమార్, రసూల్, గోపి, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్‌లు

### వివాహ వేడుకలో గొడవ.. ఇద్దరికి గాయాలు

**అమర్తలూరు(వేమూరు):** వివాహ వేడుకలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ స్వల్ప గాయాలకు దారి తీసింది. ఎస్సై రవితేజ కథనం మేరకు.. అమర్తలూరు మండలం కూచిపూడి గ్రామంలోని దళిత వాడలో సోమవారం ఒక వివాహ వేడుక జరిగింది. ఈ వివాహ వేడుకకు గుడిపూడి దీనరాజు, వేమూరు ప్రసాద్ మద్యం తాగి హాజరయ్యారు. ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమయిందని, దీంతో ఇద్దరు కొట్టుకోవడం జరిగిందని ఎస్సై రవితేజ చెప్పారు. గాయాలైన ఇద్దరు వ్యక్తులు పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేయడం జరిగిందని, ఇద్దరిపై కౌంటర్ కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

### విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

**ప్రత్తిపాడు:** విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని ఏజెన్సీల నిర్వాహకులు అందించాలని ఎంపీడీవో కె.శివపార్వతి అన్నారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈవో-2 జి.లీలారాణి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. ఎంఈవోలు సీహెచ్.రమాదేవి, లీలారాణిలు మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయన్నారు. 5వ తేదీ నుంచే ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో అందుబాటులో ఉంటారని.. ఏజెన్సీల నిర్వాహకులు కూడా పాఠశాలలకు వెళ్లి వంట గదితో పాటు పాత్రలు, పరిసరాలు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం రుచికరంగా భోజనం తయారు చేసుకుని వచ్చిన పెదగొట్టిపాడు, తుమ్మలపాలెం, ప్రత్తిపాడు ఏజెన్సీల నిర్వాహకులకు బహుమతులను అందించారు.

### చిత్రలేఖన పోటీల్లో చిన్నారుల సృజన

**ప్రత్తిపాడు:** పర్యావరణంపై అద్భుత ఆలోచనా శక్తితో ఆలోచింపజేసే చిత్రాలను చిన్నారులు గీశారు. చేతిలో కుంచె లేకున్నా, రంగురంగుల బొమ్మలను అందంగా తీర్చిదిద్దారీ చిన్నారులు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ బి.అరుణ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా చిన్నారులకు చిత్రలేఖనంపై ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్రపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో చిన్నారులు తమ ఆలోచనలకు పదునుపెట్టి బుల్లిబుర్రల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీశారు. పొల్యూషన్ వల్ల భూమాత కన్నీరు పెడుతున్నట్లు 'సేవ్ ఎనర్జీ స్టాప్ పొల్యూషన్', క్లీన్ ఇండియా, గ్రీన్ ఇండియా, స్వచ్ఛభారత్.. అంటూ అనేక సందేశాత్మక చిత్రాలను గీశారు.

## సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

**రేపల్లె:** సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి చెప్పారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి అనంతరం మాట్లాడారు. తన ఇంటికి వెళ్లే బాట ఆక్రమణకు గురైందని ఆక్రమణలను తొలగించాలని పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్ బాషా.. జంపని గ్రామంలోని కుమ్మరిగుంట చెరువును కుమ్మరి సొసైటీ పేరు మీద ఫ్రీ హోల్డ్ చేయాలని అదే గ్రామానికి చెందిన గుమ్మడిదల పద్మ.. 17, 19 వార్డులకు నూతనంగా రేషన్ దుకాణం మంజూరు చేయాలని ఇసుకపల్లికి చెందిన తాడిపర్తి మల్లికార్జునరావు అర్జీలు ఇచ్చారన్నారు. తన భూమిని సర్వే చెయ్యాలని కోరుతూ భట్టిప్రోలు మండలం గొరిగిపూడికి చెందిన ఎడ్ల కావ్య.. అలాగే తన పొలాన్ని సర్వే చేసి హద్దులు చూపించాలని కోరుతూ చెరుకుపల్లి మండలం కనగాలకు చెందిన రాసంశెట్టి శివపార్వతి.. భట్టిప్రోలు మండలం ఓలేరుకు చెందిన డొక్కా విజయలక్ష్మి.. తన పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ పెసర్లంకకు చెందిన దేవాభక్తుని వినోద్ సాయి అర్జీలు ఇచ్చారన్నారు. రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ 9వ వార్డుకు చెందిన ఐనంపూడి శ్రీకాంత్ అర్జీ దాఖలు చేసినట్లు తెలియజేశారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు.

## రంగారావుకు ఉపాధ్యాయ సేవా ప్రతిభ అవార్డు రావటం అభినందనీయం

**ఎంఈవోలు పులి లాజర్, టి.నవీన్ కుమార్**



హైదరాబాదులో ఉపాధ్యాయ సేవా ప్రతిభ అవార్డు అందుకుంటున్న రంగారావు

**చెరుకుపల్లి:** విశ్రాంత ఉపాధ్యాయుడు ఇంకొల్లు రంగారావుకు ఉపాధ్యాయ సేవా ప్రతిభ అవార్డు పురస్కారం దక్కటం ఉపాధ్యాయులందరికీ గర్వకారణమని ఎంఈవోలు పులి లాజర్, టి.నవీన్ కుమార్‌లు పేర్కొన్నారు. హైదరాబాదుకు చెందిన మెగా హెన్సింగ్ ఫౌండేషన్ ఈ నెల 31వ తేదీన జాతీయ ఉత్తమ అవార్డు గ్రహీత బాపట్ల జిల్లా జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు, ఇంకొల్లు రంగారావు ఉపాధ్యాయ వృత్తిలో తాను చేసిన సైన్సు ప్రయోగాలు, విద్యార్థుల పట్ల ఆయన చూపిన ప్రత్యేక శ్రద్ధ, అందించిన సేవలకు గాను హైదరాబాదు చికట్‌పల్లి త్యాగరాయ గాన సభ వారు ఈ ఉపాధ్యాయ సేవా ప్రతిభ అవార్డు అందించినట్లు సోమవారం వారు తెలిపారు. అవార్డు గ్రహీత రంగారావు మాట్లాడుతూ తాను విద్యార్థులకు అందించిన సేవలను గుర్తించి మెగా హెన్సింగ్ ఫౌండేషన్ చైర్మన్ పి.నిరీషారెడ్డి, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రామ్‌తేజ్, ప్రముఖ సినీ నటుడు పృధ్వీరాజ్ వంటి ప్రముఖుల చేతుల మీదగా అవార్డు అందుకోవటం సంతోషం కలిగించిందని అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు కాటూరి నాగేశ్వరరావు, పరదామ కోటేశ్వరరావు, బి.సాంబయ్య నాయక్ తదితరులు రంగారావుకు అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి యోగా పోటీలు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

**కర్లపాలెం:** ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా మంగళవారం నుంచి సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో యోగా పోటీలు జరుగుతాయని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. యోగా దినోత్సవంలో భాగంగా గత నెల 29 నుంచి సోమవారం వరకు సచివాలయ సిబ్బందికి జరిగిన యోగా శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండల కేంద్రం కర్లపాలెంలోని ఎంవీరాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 7వ తేదీ వరకు యోగా పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు. 3వ తేదీన జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో సోలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు, మెడిటేషన్ పోటీలు జరుగుతాయని, 4, 5 తేదీలలో జూనియర్స్, సీనియర్స్ విభాలలో యోగాసనాలు, యోగా సాంగ్స్, యోగా పెయింటింగ్స్ పోటీలు జరుగుతాయని అన్నారు. 6, 7 తేదీలలో యోగా క్విజ్, యోగా సాంగ్స్, యోగా షార్ట్ ఫిలిమ్ పోటీలు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

## కౌలు రైతు కార్డులు కావాలంటే టీడీపీ నాయకులు చెప్పాలా..!?

**తహసీల్దార్‌ను ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాపనయ్య**



వీఆర్వోపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ బాపనయ్య, గ్రామస్తులు

**నగరం:** కౌలు రైతులు కార్డులు కావాలంటే టీడీపీ నాయకులు చెబితేనే ఇస్తాననడం ఏంటని అద్దంవారిపాలెం ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్య తహసీల్దార్ నాంచారయ్యను ప్రశ్నించారు. స్థానిక తహసీల్దార్ కార్యాయలంలో సోమవారం అద్దంకివారిపాలెం గ్రామ కౌలు రైతులు తహసీల్దార్ నాంచారయ్యను కలిసి గ్రామ వీఆర్వో పోతురాజుపై ఫిర్యాదు చేశారు. కౌలు రైతులు కార్డులు కావాలని వీఆర్వోను అడిగితే గ్రామంలోని టీడీపీ నాయకులను కలవాలని అప్పుడే ఇస్తానని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాపనయ్య మాట్లాడుతూ వీఆర్వో పోతురాజు కౌలు రైతుల కార్డుల కోసం టీడీపీ నాయకుల వద్దకు వెళ్లాలని చెప్పడం ఎంత వరకు సబబన్నారు. నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన కౌలు రైతు కార్డులను టీడీపీ నాయకుల సిఫారస్‌తో ఇవ్వడం ఏమిటన్నారు. గ్రామంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కౌలు రైతు కార్డులు వచ్చేలా చర్యలు చేపట్టాలని బాపనయ్య తహసీల్దార్‌ను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వీఆర్వో పోతురాజుపై చర్యలు తీసుకోవాలన్నారు.

#### ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవోకు వినతి...

అద్దంకివారిపాలెం పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించడం లేదని ఎంపీటీసీ లుక్కా బాపనయ్య గ్రామస్తులతో కలిసి ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. జాబ్‌కార్డులు ఉన్నా ఎందుకు పనులు కల్పించడం లేదని ఎంపీడీవోని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి పనులు కల్పించి వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు పనులు కల్పించడం లేదని బాపనయ్య ఎంపీటీసీ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి గ్రామంలో జాబ్‌కార్డులు ఉన్న వారికి ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు.

## కుచ్చెళ్లపాడులో అంబేడ్కర్ విగ్రహ వార్షికోత్సవం



**వేమూరు:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహ వార్షికోత్సవం నిర్వహించడం జరిగిందని ఆంధ్ర యూనవర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, జై భీమ్ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బోరుగడ్డ సుబ్బయ్య అన్నారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి 18 సంవత్సరాలు అయిన సందర్భంగా సోమవారం 18వ వార్షికోత్సవం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆపరేషన్ సిందూర్‌లో దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో బోరుగడ్డ పృధ్వీరాజ్, న్యాయవాది కొండపూడి సునీల్ కుమార్, గుడిమాటి వర్ధన్, బోరుగడ్డ వేణు, పెరికల భాను, పెరికలు యాకోబు, పెరికల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



### వీధి కుక్కలు పట్టివేత



**రేపల్లె:** వీధి కుక్కల నుంచి పట్టణ ప్రజలకు ఇబ్బందులను తొలగించేందుకు కుక్కలు పట్టే కార్యక్రమాన్ని చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు చెప్పారు. రేపల్లె మున్సిపాలిటీ, గుంటూరు స్నాప్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ ద్వారా వీధి కుక్కలు పట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కమిషనర్ సాంబశివరావు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి, వార్డులలో వీధి కుక్కల బెడద అధికమైందని ప్రజల నుంచి వచ్చిన అభ్యర్ధనల మేరకు స్పెషల్ డ్రైవ్‌ల ద్వారా కుక్కలు పట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పట్టిన కుక్కలను గుంటూరులోని స్టెరిలైజేషన్ సెంటరుకు తరలించబడునన్నారు. పెంపుడు కుక్కలను యజమానులు ఇంటి నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.